క్లుప్తంగా

పరిమితికి మించి తీసుకెళ్తే చర్యలు



ఏటూరునాగారం: పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్తే చర్యలు తప్పవని ఎస్సై తాజొద్దీన్ డ్రైవర్లను హెచ్చరించారు. సోమవారం మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీలు చేస్తుండగా ఆటోలో 23 మందిని వ్యవసాయ కూలీలను తీసుకెళ్తడగా ఆపి కౌన్సెలింగ్ నిర్వహించారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఆటోలలో వేలాడుతూ ప్రయాణించడం ద్వారా ప్రమాదాలకు గురి అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఆయన సివిల్, సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



వెంకటాపురం(కె): భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్యను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించడంపై మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు మన్నెం సునీల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెంశివ, ఎంపీటీసీ గార్లపాటి రవి, నాయకులు ఎడ్ల క్రాంతి తదితరులు ఉన్నారు.

చేతి పంపునకు మరమ్మతు

ఏటూరునాగారం: మండలంలోని కొమురం భీం గొత్తికోయగూడెంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కోయగూడ ఎల్లాపురం గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది సోమవారం చేతి పంపును మరమ్మతు చేయించారు. కొన్ని రోజులుగా మరమ్మతుకు నోచుకోకుండా ఉండడంతో తాగునీటి సమస్యలు వచ్చేవని గ్రామస్తులు తెలిపారు. చేతి పంపు మరమ్మతు చేయడం వల్ల తమకు నీటి వసతి లభించిందని గ్రామస్తులు తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ములుగు: ఉన్నతాధికారి, కింది స్థాయి సిబ్బంది పెట్టిన ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాస్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్ట మురళికృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో సంఘ కార్యాయలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ధైర్యం చెప్పి అండగా నిలబడాల్సిన ఎస్సై ఆత్మహత్య చేసుకోవటం బాధాకరం అన్నారు. ఘటనపై సత్వర న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంచర్ల నాగేశ్వరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బక్కి నవీన్, వేణు తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

వెంకటాపురం(ఎం): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మిల్కూరి అయిలయ్య తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కూరెల్ల విజయలక్ష్మికి రూ.22.500ల చెక్కు, బొంతల సమ్మక్కకు రూ.15వేల చెక్కును అందించినట్లు అయిలయ్య వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు చెన్నోజు శ్రీనివాస్, జంగిలి రవి, కాంతాల రాజిరెడ్డి, నల్లా కోటి, వెంకటేష్, సాంబయ్య పాల్గొన్నారు.

రెండు నెలల్లోపే పగుళ్లు!

- నాణ్యతా లోపంతో కుంగిన సీసీ రోడ్డు..
- రూ.లక్షల ప్రజాధనం వృథా

గోవిందరావుపేట: మండలంలోని పాపయ్యపల్లి శ్మశానవాటిక నుంచి సంద్రగూడెం గ్రామం వరకు ఐటీడీఏ నిధుల నుంచి రూ.40 లక్షలతో 450 మీటర్లు సీసీ రోడ్డు వేశారు. సీసీ రోడ్డు నిర్మించి రెండు నెలలు కుడా ఇంక పూర్తి కాలేదు కానీ అప్పుడే పగుళ్లు వచ్చి మూడు ఇంచుల మందం లోపలికి కుంగిపోయింది. ఇది ముందు ముందు మరింత కుంగిపోయే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ల ధన దాహానికి పది కాలాల పాటు నాణ్యతగా ఉండాల్సిన రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. బిల్లులు వసులు చేసుకునే శ్రద్ధ పని మీద చూపలేకపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించే కాంట్రక్టర్లకు మాత్రమే పనులు అప్పజెప్పాలని, రూ.లక్షలను వృథా చేయొద్దని ప్రజలు కోరుతున్నారు.



కుంగిపోయిన సీసీ రోడ్డు



పగుళ్లు ఏర్పడిన సీసీ రోడ్డు

రోడ్డును పరిశీలించా..



ఐటీడీఏ నిధుల నుంచి నిర్మించిన రోడ్డు పగుళ్లు వచ్చి కుంగిపోయిన నా దృష్టికి వస్తే సోమవారం వెళ్లి పరిశీలించా. సీసీ రోడ్డు ఇరువైపులా పగుళ్లు వచ్చి, లొపలికి కుంగిపోయింది. సదరు కాంట్రక్టర్ పిలిచి మళ్లీ రీ-కన్‌స్ట్రక్షన్ చేయమని చెప్పాం. అన్ని నిబంధనల ప్రకారం క్వాలిటీతో నిర్మిస్తినే బిల్లు పాస్ అవుతుంది. పనిలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కాంట్రక్టర్లను ఉపేక్షించేది లేదు.

\- డి.వీరభద్రం, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్

చర్య తీసుకోవాలి



రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తే, పట్టుమని రెండు నెలలు కాకముందే కుంగి పగుళ్లు ఏర్పడింది. కాంట్రక్టర్లు, అధికారులు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోని, సదరు కాంట్రక్టర్‌పై చర్య తీసుకోవాలి.

\- నరసింహనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

కూలీలకు తునికాకు బోనస్ చెల్లించాలి

ఏటూరునాగారం: కూలీలకు తునికాకు బోనస్ చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రాన్ని అందజేసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తునికాకు సేకరించిన కూలీలకు బోనస్ రావడం లేదన్నారు. గతంలో అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు కలిసి బీనామి పేర్లతో బోనస్ డబ్బులు కాజేశారన్నారు. తునికాకు సేకరించిన కూలీలకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించాలని ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, నాయకులు నర్సింహారావు, చిన్న ఎల్లయ్య, గౌస్, కర్ల అరుణ, పోషయ్య, వీసం నర్సయ్య, రియాజ్, రామయ్య, మధు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

చెరువుకు మరమ్మతులు చేపట్టాలి

వెంకటాపురం(ఎం): బురుగుపేట పరిధిలోని మారేడుగొండ చెరువుకు మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని మారేడుగొండ చెరువును పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. చెరువు కట్టకు గండ్లు పడి ఎడాది కావస్తున్నా ఇప్పటి వరకు మరమ్మతులు చేయకపోవడంతో చెరువు కింద ఉన్న వెయ్యి ఎకరాల ఆయకట్టు బీడుగా మారుతుందని పేర్కొన్నారు. గతేడాది చెరువు కట్ట తెగడంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మీరా హరీశ్, వీరబోయిన రాజేందర్, రాహుల్ నాయక్, మహేందర్, శ్రీకాంత్, చంటి, కుమార్, రమేష్, పవన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



చెరువు గండిని పరిశీలిస్తున్న జంపన్న, నాయకులు

రైతుల సమస్యలు పరిష్కరించాలి



మంగపేట: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగపేట: రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు లోడె శ్రీనివాస్, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు జాడి రామరాజునేత ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్ రావుకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులందరికీ బేషరతుగా ప్రభుత్వం రూ.రెండు లక్షల రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15,000 అమలు చేయాలని కోరారు. తెలంగాణలో రైతాంగానికీ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వర్తింపచేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చీకట్ల ఏకస్వామి, జిల్లా కిసాన్ మోర్చా సభ్యులు కృష్ణమూర్తి, దళిత మోర్చా అధ్యక్షుడు సమ్మయ్య, మండల కోశాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ జాడి రామరాజు నేత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌రావుకు బీజేపీ నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్, ఎలుకపల్లి శ్రీనివాస్, గండెపల్లి సత్యం, గద్దెల ప్రణయ్, సంపత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రిటైర్మెంట్ ప్రక్రియ నిలిపేయాలి

ములుగు రూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీల రిటైర్మెంట్ ప్రక్రియను నిలిపేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సోమవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. 40 సంవత్సరాలు అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేసిన వారిని ఎలాంటి గుర్తింపు లేకుండా విధుల నుంచి తొలగించడం సరికాదని అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరం అయ్యేంత వరకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, చిట్టిబాబు, రాజేష్, ఉపేంద్రాచారి, రమే, బ్రహ్మాచారి, కవిత, రజిత, సరోజన, జమున, రాణి, సూరమ్మ, వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల వెంకట్‌రెడ్డి

గుడిసెవాసులను విస్మరించిన నాయకులు



మాట్లాడుతున్న సాంబశివ

వాజేడు: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు గుడిసెవాసులకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేసి అధికారంలోకి వచ్చిక వారిని విస్మరించారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని పూసూరు, వాజేడు గ్రామాల మధ్యన వేసిన పేదల గుడిసెల వద్ద సీపీఎం పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడచిన 10 నెలలుగా గుడిసెలు వేసుకుని పేదలు నివాసం ఉంటుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గుడిసెవాసులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు గుడిసెవాసులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఇప్పుడు హక్కుపత్రాలను ఇవ్వడం మాట మర్చిపోయారని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి రఘుపతిరావు, దేవయ్య, దామోదర్, కృష్ణబాబు, కుమారి, సౌమ్య, శాంతకుమారి, ప్రవీణ్, భూలక్ష్మి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

జన హృదయ నేతకు ఘన నివాళి

మంగపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనహృదయ నేత చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన పాలనలో ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. దేశంలోనే మరెక్కడ అమలు చేయని, చేయలేనటువంటి ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలుచేసి చూపించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వైకుంతం, జిల్లా, మండల నాయకులు యానయ్య, భగవాన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కారుపోతుల నర్సయ్యగౌడ్, చాద మల్లయ్య, హుస్సేన్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



మంగపేట: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు చిడెం మోహనరావు మాట్లాడుతూ.. రాజశేఖరరెడ్డి హయాంలోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. రైతుల సంక్షేమం కోసం నీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకులు వైఎస్సార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిడెం శివ, మన్నెం సునీల్, సయ్యద్‌హుస్సేన్, ప్రకాశ్, రమేశ్, బాలసాని వేణు, కాల్వ సుందర్రావ్, తోట శ్రీను, గాందర్ల నాగేశ్వరావు మద్దుకూరి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

గోవిందరావుపేట: దివంగత నేత వైఎస్సార్ 75వ జయంతిని సోమవారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. మండల కేంద్రంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు రామచంద్రపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ.. మహానేత రాజశేఖర రెడ్డి చేసిన సేవలు ప్రతి పేద వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగుజ్జు వెంకన్న, పెండెం శ్రీకాంత్, కణతల నాగేందర్, హరి ప్రసాద్, మద్దెల నాగమణి, మాజిత, కృష్ణ స్వామి, శివ, వెంకటేష్, అహల్య, వజ్రమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో వైఎస్సార్ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తాళ్లపాడు వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మిల్కూరి అయిలయ్య, నాయకులు చెన్నోజు శ్రీనివాస్, జంగిలి రవి, గోల్లేన వెంకటేష్, పులి రమేష్, తడుక అయిలయ్య పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం): వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆరోగ్యశ్రీ పథకం వైఎస్సార్ కృషే..

ఏటూరునాగారం: ఆరోగ్యశ్రీ పథకం ప్రజలకు వరమని, దివంగత వైఎస్సార్ చొరవతోనే ఆ పథకం అమలు అయిందని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు రఘు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడ్ల దేవేందర్, వావిలాల ఎల్లయ్య, ఆయూబ్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం(కె): వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు



గోవిందరావుపేట: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఏటూరునాగారం: వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

మంగపేట: మండలంలోని అకినేపల్లిమల్లారంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని వికాస్ అగ్రి ఫౌండేషన్ చైర్మన్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముందు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసి ఆయన పాలనలో అమలు చేసిన రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజురియింబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలను అమలు చేసి వ్యవసాయ రంగాన్ని పండుగలా చేసి అపరభగీరథుడయ్యాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వర్‌రావు, సరోజ, రాంసింగ్ గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న సాంబశివరెడ్డి

గుంతల పూడ్చివేత



మట్టి పోయిస్తున్న పోలీసులు

వెంకటాపురం(ఎం): గతేడాది మారేడుగొండ చెరువుకు గండ్లు పడి లక్ష్మీదేవిపేట-బుర్గుపేట గ్రామాల మధ్య రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతలు ఏర్పడడంతో పాటు రోడ్డు కోతకు గురవుతుంది. దీంతో వెంకటాపురం ఎస్సై జక్కుల సతీశ్ చొరవ తీసుకొని బుర్గుపేట ట్రాక్టర్ యూనియన్ సభ్యులతో మాట్లాడి ట్రాక్టర్ యాజమానులతో చర్చించారు. ట్రాక్టర్ ఓనర్స్ స్వచ్ఛంధంగా మట్టి తీసుకువచ్చి కోతకు గురవుతున్న రోడ్డుకు ఇరువైపులా, గుంతలు పడిన చోట పోశారు. దీనితో ట్రాక్టర్ యజమానులను ఎస్సై సతీష్ అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మల్లూరులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున



ములుగు: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రసాద్

మంగపేట: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నపెల్లి యమున తెలిపారు. మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని మెట్టుగూడెంలో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులతో పాటు గర్భిణులు, మహిళలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. పీహెచ్ఎన్ రాంబాయి, ఏఎన్ఎం సీతమ్మ, ఆశా కార్యకర్తలు సాంభలక్ష్మి, యజ్ఞమ్మ పాల్గొన్నారు.

రాజుపేటలో..

మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో రాజుపేటలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పొదెం రవి, ఏఎన్ఎం అరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ములుగు: సీజనల్ సమయంలో వచ్చే మూడు నెలల పాటు అప్రమత్తంగా ఉండాలని రాయనిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రసాద్ సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ బానోత్ జితేందర్‌తో కలిసి ములుగు మండలం జాకారం గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 34 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఆరుగురికి ఆర్డీడీ టెస్టులు నిర్వహించగా అందరికి నెగిటివ్ వచ్చినట్లు తెలిపారు. ఎవరికైన జ్వరం వచ్చినట్లు అనిపించినా, ఒళ్లు నొప్పులు, దగ్గు జలుబు లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని సబ్ సెంటర్‌కు లేదా ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తిరుమల, సుజాత, ఆశ వర్కర్లు కవిత, కరిష్మా ఉన్నారు.